ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 102 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 22 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# నెలలో ఒకరోజు సైట్‌లోనే బస చేస్తా : సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రతి నెలా తనిఖీ చేస్తా**

**కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**

**హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్‌ను పరిశీలించిన సీఎం**

**పనుల్లో వేగం పెంచాలని అధికారులకు ఆదేశం**

**నెలకు ఒకరోజు సైట్‌లోనే బస చేస్తానని స్పష్టీకరణ**

**హైదరాబాద్, జులై 21 (ప్రభాత ఉదయం)**

హకీంపేటలోని ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని ఎట్టి పరిస్థితిలో సహించబోనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సొంత నియోజకవర్గం కొడంగల్ చేరుకున్న ముఖ్యమంత్రి, దుద్యాల మండలం హకీంపేటలో అభివృద్ధి పనులను పరిశీలించారు. 248 ఎకరాల్లో చేపడుతున్న మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇంజినీరింగ్ కళాశాల, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. సైట్‌లోనే బస చేస్తా : పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రతి ప్రాజెక్టు పనుల పురోగతిపై నెలవారీగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పనులను ప్రతీనెలా తనిఖీ చేస్తానని, నెలకు ఒకరోజు సైట్‌లోనే బస చేస్తానని సీఎం స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం వహించిన వారిని సస్పెండ్ చేసేందుకు సైతం వెనకాడబోనని తేల్చి చెప్పారు. ఈ ప్రాజెక్టుల కింద భూముల కోల్పోయిన రైతులకు వచ్చే వారంలోగా ఫ్లాట్లు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. భూ సేకరణ పూర్తి చేయాలి : మక్తల్–నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటినీ వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సెప్టెంబర్ లోగా ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



# ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..

## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా.. రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన**

**రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు**

**అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్**

**న్యూఢిల్లీ, జులై 21 (ప్రభాత ఉదయం)**

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్

..మిగతా 2లో

## నీట్ లీకేజీపై .... విద్యార్థులను

# రెచ్చగొట్టొద్దు

**న్యూఢిల్లీ, జులై 21 (ప్రభాత ఉదయం)**



నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీకలేను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించారు. 'పిల్లలను రెచ్చగొట్టొద్దు. తపడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్, మేలో నిర్వహించగా.. పేపర్ లీక ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో దిల్లీ రణరంగాన్ని తలపించింది. ఈ నేపథ్యంలోనే మోదీ స్పందన వచ్చింది.

## కవిత ఆరోపణలకు
# హరీశ్ రావు సమాధానం చెప్పాలి
## మంత్రి ఉత్తమ్



**కాళేశ్వరం కాంట్రాక్టర్ల నుంచి బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు**

**దేవాదుల పంపులు నిరంతరం పని చేస్తాయి**

**తొమ్మిది పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం**

**హైదరాబాద్, జులై 21 (ప్రభాత ఉదయం)**

దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఈ రాత్రి నుంచే 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన చిట్–చాట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు

..మిగతా 2లో

# ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తం

**వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష**

**హాజరైన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. రైతులకు భరోసా..**




**హనుమకొండ జులై 21 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,

..మిగతా 2లో

## ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం
# ఆధార్ తప్పనిసరి కాదు

**ఓటర్ల జాబితా సవరణ**

**ఆధార్‌పై తెలంగాణ సీఈవో కీలక ప్రకటన**

**ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి**

**ఇతర గుర్తింపు పత్రాలతో నమోదు చేసుకునేందుకు అవకాశం**

2






## కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి
# కిషన్ రెడ్డి ఆగ్రహం

**ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

**పార్లమెంటులో చర్చించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపాటు**

**వరుస ఎన్నికల్లో ఓడినా కాంగ్రెస్ తీరు మారడం లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్, జులై 21 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత పార్లమెంటులో ప్రశ్నలు అడగటం, చర్చలు జరపడమే తప్ప, సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించడం కాదని ఆయన హితవు పలికారు. సభలో చర్చకు ఆస్కారం లేకుండా పదేపదే అంతరాయం కలిగిస్తూ, వాయిదాలకు కారణమవుతున్న కాంగ్రెస్, బయటకు వచ్చి ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ నాటకాలాడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇది బాధ్యతాయుతమైన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ప్రజాస్వామ్యాన్ని

..మిగతా 2లో

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి...

పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో కలిసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలు, తాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితులు, భూగర్భ జలాల స్థితిగతులపై ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నిరంతరం సమీక్షించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తారని, అనంతరం సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్న మంత్రి ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళికలు రూపొందించుకునేలా రైతులకు నిరంతరం సలహాలు అందించాలని ఆదేశించారు. అలాగే కోతుల బెడద వల్ల పంటలకు నష్టం జరగకుండా నివారణ చర్యలపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న మంత్రి పొంగులేటి దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఈ ప్రక్రియను ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూలై 27 వరకు ఎల్‌నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే లెమన్ గ్రాస్, మెట్ట పంటలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించుకునేలా క్షేత్రస్థాయిలో నిరంతర మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగాన్ని కూడా నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్న మంత్రి, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల స్థితిగతులపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు సమిష్టిగా బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ప్రత్యేక అధికారి దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆల్మట్టికి పోటెత్తుతున్న వరద నీరు
# ఆశగా ఎదురుచూస్తున్న జూరాల

**ఎగువన భారీ వర్షాలతో ఆల్మట్టి, నారాయణపూర్‌లకు పెరుగుతున్న వరద.**

**ఎగువ ప్రాజెక్టులు నిండితేనే జూరాలకు నీటి విడుదలయ్యే అవకాశం.**

**కృష్ణమ్మ రాక కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 21(ప్రభాత ఉదయం)**


ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఈ వర్షాల ప్రభావంతో కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లో నీటి మట్టాలు వేగంగా పెరుగుతూ నిండుకుండలా మారుతున్నాయి. అయితే, ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నీటి విడుదలపైనే ఆధారపడిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇంకా వరద ప్రవాహం ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం వెలవెలబోతోంది. మహారాష్ట్రలో వర్షాలు నిలకడగా కురుస్తుండటంతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నీటి నిల్వలు త్వరలోనే పూర్తిస్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఆ ప్రాజెక్టులు నిండిన వెంటనే దిగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తారని, త్వరలోనే జూరాలకు కృష్ణమ్మ పరవళ్లు ప్రారంభమవుతాయని ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం ఆశగా ఎదురుచూస్తోంది.

**100 టీఎంసీలు దాటిన ఆల్మట్టి డ్యాం**

ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణానదికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో ఆల్మట్టి డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుతోంది. మంగళవారం ఉదయానికి ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 46,848 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్ ఫ్లో 16,351 ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకు గానూ ప్రస్తుతం 1699.38 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 101.19 ఉంది. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయానికి 46,848 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దీంతో విద్యుత్ ఉత్పత్తికి 12,500, కాలువలకు 3, 751 క్యూసెక్కుల వరద నీటి విడుదల చేయడంతో మొత్తం 16,351 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణ పూర్ డ్యాంకు ఎగువ ప్రాంతాల నుంచి 14,428 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 8,209 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యాం గరిష్ఠస్థాయి నీటి మట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1604. 63 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ 24.67 టీఎంసీలు ఉన్నది.



ఆల్మట్టి డ్యాం



జూరాల ప్రాజెక్టు

**వెల వెల బోతున్న జూరాల**

ఎగువన ఉన్న కర్ణాటక జలాశయాలు నిండుతున్నప్పటికీ తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మాత్రం ఇంకా వెలవెలబోతోంది. జూరాల ప్రాజెక్టు పూర్తిగా ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి విడుదలయ్యే నీటిపైనే ఆధారపడి ఉండటంతో, ఇక్కడ వరద ప్రవాహం ఇంకా పుంజుకోలేదు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లకుగాను ప్రస్తుతం 315.99 మీటర్ల వద్ద నీరు ఉన్నది. జూరాలలో 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 5.165 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

# బురదమయమైన రోడ్లతో తంటాలు పడుతున్న వ్యాపారులు!

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20 (ప్రభాత ఉదయం)**





గద్వాల పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యంగా భీంనగర్, అంబేద్కర్ చౌరస్తా తదితర ప్రధాన ప్రాంతాలలో అధికారులు ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ సగానికే పరిమితమైంది. ఆక్రమణలు తొలగించి రెండు నెలలు గడుస్తున్నా, తవ్విన రోడ్లను పునరుద్ధరించకపోవడంతో స్థానిక వ్యాపారులు, పౌరులు తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ఇరువైపులా గుంతలు తవ్వి, మట్టిని అలాగే వదిలేయడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారి అంతా తీవ్రంగా బురదమయంగా మారింది. షాపుల ముందు నడవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడటంతో వినియోగదారులు కొనుగోలుకు రావడానికి వెనుకాడుతున్నారు. రోడ్డుపై బురద, గుంతల వల్ల కేవలం వ్యాపారాలే కాకుండా కాలినడకన వెళ్లే పౌరులు, ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పురపాలక, సంబంధిత అధికారులను వివరణ కోరగా... సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే కేవలం మాటలకే పరిమితం కాకుండా, తక్షణమే రోడ్డుపై ఉన్న మట్టి, బురదను తొలగించి తాత్కాలికంగా మెటల్ లేదా క్రషర్ పొడి వేసి రాకపోకలకు వీలు కల్పించాలని, వెంటనే పక్కా సీసీ/బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గద్వాల పట్టణ ప్రజలు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. "ఆక్రమణలు తొలగించి రెండు నెలలైనా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. వర్షాల వల్ల షాపుల ముందే బురద చేరడంతో బోసిపోయిన గిరాకీలతో తీవ్ర నష్టాలు వస్తున్నాయి. ఇట్లయితే మేము జీవనం ఎలా సాగించాలి?"--- స్థానిక వ్యాపారుల ఆవేదన

# బి ఆర్ ఎస్, కాంగ్రెస్ వైఫల్యాల వల్లే తెలంగాణ నష్టపోయింది

**బీజేపీ జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 21(ప్రభాత ఉదయం)**

బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలు, ఒప్పంద రాజకీయాలు , దుష్పరిపాలన కారణంగా తెలంగాణ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి విమర్శించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి కేవలం బీజేపీ 'డబుల్ ఇంజన్' సర్కార్‌తోనే సాధ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంగళవారంకేటీ దొడ్డి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి డి.కె. స్నిగ్ధా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కమీషన్లు చెల్లించకపోతే కాంట్రాక్టర్ల బిల్లులు కూడా రాని దుస్థితి నెలకొందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాగుతున్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు, జూటా మాటలు చెప్పేందుకు సిద్ధమవుతోందని, ప్రజలు ఆ మాయమాటల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా తీసుకుని, చురుగ్గా పాల్గొనాలని కోరారు. తెలంగాణ ప్రజలకు పారదర్శకమైన, అభివృద్ధి కేంద్రిత, జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన అందించే ఏకైక ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోబీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా దీజీవీ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కౌన్సిలర్ శాలన్న, ఉపసర్పంచ్ ఎర్రభీం రెడ్డి, కేటీ దద్ది మండల సీనియర్ నాయకులు యర్రన్ దొడ్డి హనుమంతు, కేటీ దొడ్డి అశోక్, రఘు, దేవేందర్ రెడ్డి, ఉమిత్యాల కర్రెప్ప, పాగుంట, సర్పంచ్ అంజనప్ప, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, కృష్ణకాంత్, కొండన్న, అంపిరెడ్డి, కుచినెర్ల నరసింహులు, రంగాపురం కృష్ణ, గోవిందు, శంకర్ నాయక్, వాచ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి .

# ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..

మొదటి పేజీ తరువాయి...

వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

# కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి

మొదటి పేజీ తరువాయి...

చేస్తోందని చెప్పారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై తపడు ప్రచారం చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను ఎందుకు మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్ అమలు చేశారో హరీశ్ రావు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. ఆ నిర్ణయం వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి చేరుకుందని అన్నారు. అలాగే, కాళేశ్వరం కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని ఎమ్మెల్సీ కే. కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతులను తపదోవ పట్టించడం మానేసి, ఆ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి...

కాలరాసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, పుదుచ్చేరి వంటి అనేక రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీ ప్రజాసేవ కంటే రాజకీయ అవకాశవాదానికే పెద్దపీట వేస్తుందని, ప్రజలు ఇప్పటికే వారి నిజస్వరూపాన్ని గుర్తించారని ఆయన పేర్కొన్నారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా చేతులకు సంకెళ్లు వేసుకోవడంపై ఆయన ఎద్దేవా చేస్తూ, ఆ పార్టీ రాజకీయ ఆకాంక్షలకు భారత ప్రజలు ఎప్పుడో సంకెళ్లు వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు నిజంగా వాదనలు వినిపించాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దేశానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరమే కానీ, నిరంతరం గందరగోళం సృష్టించే ప్రతిపక్షం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం ఆధార్ తప్పనిసరి కాదు

**హైదరాబాద్, జులై 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపడానికి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే, దరఖాస్తు ఫారాలు నింపే సమయంలో ఆధార్ వివరాలు సమర్పించడం తప్పనిసరి అని కొందరు భావిస్తుండటంతో సీఈవో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు అందుబాటులో లేని అర్హులైన పౌరులు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్తగా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా, సుదర్శన్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎన్నికల అధికారులతో (డీఈఓలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వారాంతం నాటికి జిల్లాల్లో ఓటర్ల గణన ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన ఓటర్లను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తిరిగి భౌతిక పత్రాలు కోరకూడదని, అలాగే ఆధార్ కార్డుల కోసం ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తుల సమర్పణలో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లోని డివిజన్‌లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం

**బుద్వేల్ , జూలై 21 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లోని పలు డివిజన్ లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి సిఫార్సుల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

డివిజన్ ల వారిగా : అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులుగా మంగళారం గోవర్ధన్ రెడ్డి నియమితులైనారు. హైదర్ గూడ డివిజన్ అధ్యక్షులుగా సామ ఇంద్రపాల్ రెడ్డి, సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షులుగా మహమ్మద్ గౌస్, శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షులుగా శౌకత్, కాటెదాన్ డివిజన్ అధ్యక్షులుగా ఎన్ ధనుంజయ, మైలార్ దేవుపల్లి డివిజన్ అధ్యక్షులుగా టి ప్రేమ్ గౌడ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులుగా పడమటి శ్రీధర్ రెడ్డి లు నియమితులైనారు.



మంగళారం గోవర్ధన్ రెడ్డి | సామ ఇంద్రపాల్ రెడ్డి | నత్తి ధనుంజయ | టి ప్రేమ్ గౌడ్ | పడమటి శ్రీధర్ రెడ్డి

# దేవుని ప్రేమ ను బట్టి క్రైస్తవ సంఘాలను నడిపించాలి :

## రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో బైబిల్ సందేశాలను వివరించిన రెవరెండ్ డాక్టర్ జోసెఫ్ కిషోర్

**బుద్వేల్, జూలై 21 (ప్రభాత ఉదయం)**

క్రైస్తవ సంఘాలకు కాపరులుగా పనిచేస్తున్న దైవ సేవకులు దేవుని ప్రేమను బట్టి సంఘ సభ్యులను నడిపించాలని ప్రపంచ క్రైస్తవ వర్తమానికులు, అత్తా పూర్ తేజస్వినగర్ లోని ట్రినిటి కాథడ్రల్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎ బి జోసెప్ కిషోర్ అన్నారు. లక్ష్మీగూడ లో గల జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిఫ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఉపాధ్యక్షులు పాస్టర్ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెవరెండ్ డాక్టర్ ఎ బి జోసెఫ్ కిషోర్ సంఘ కాపరులు క్రైస్తవ సంఘాన్ని ఎలా నడిపించాలి అనే అంశంపై బైబిల్ సందేశాలను అందజేశారు. సంఘాన్ని, సంఘ సభ్యులను సరియైన మార్గంలో నడిపించాలని, విశ్వాసులను ఆదరించాలని సూచించారు. ఉపదేశించే సమయంలో ప్రేమతో యేసు ప్రభువు బోధించిన మాటలు చెప్పాలన్నారు. ఖండించే విషయంలోను ప్రేమతో ఖండించాలన్నారు. సత్యాన్ని బోధించాలన్నారు. బైబిల్ లో ఉన్నదున్నట్లు బోదించాలన్నారు. భిన్నమైన బోధనలను చెప్ప వద్దన్నారు. దేవున్ని పూర్ణ హృదయంతో ప్రేమించే వారిగా ప్రతి ఒక్కరు ఉండాలన్నారు. బైబిల్ సం దేశాలను వివరించిన రెవరెండ్ డాక్టర్ ఎ బి జోసెప్ కిషోర్ ను రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ బి ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్ లతో పాటు కమిటీ ఉపాధ్యక్షులు పాస్టర్ ప్రమోద్ కుమార్. సంయుక్త కార్యదర్శి పాస్టర్ సోమారం రాజ్కుమార్, కమిటీ సభ్యులు రెవరెండ్ ఎం విజయ్ కుమార్, పాస్టర్ యేసు రత్నం, పాస్టర్ గుంటి డానియేల్, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్ లు సన్మానించారు. ఈ ప్రార్ధన సమావేశాలకు జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ జాన్ వెస్లీ ఆతిధ్యం ఇచ్చారు.




బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ డాక్టర్ ఎ బి జోసెఫ్ కిషోర్




రెవరెండ్ డాక్టర్ జోసెఫ్ కిషోర్ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు

# గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ..

## సేవాభావంతో ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలం: జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**స్టేషన్ పరిశుభ్రత, రికార్డులు, సిబ్బంది కిట్, క్రైమ్ వాహనాల తనిఖీ.. నూతన కాంపౌండ్ వాల్, పార్కింగ్ షెడ్ ప్రారంభం**

**నాణ్యమైన దర్యాప్తు, కమ్యూనిటీ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తో నేరాల నియంత్రణకు ఎస్పీ దిశానిర్దేశం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 21(ప్రభాత ఉదయం)**

వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, పోలీసుల సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి, పార్కింగ్ షెడ్, న్యూ కాంపౌండ్ వాల్ లను ఇనాగ్రేషన్ చేయడశీతో పాటు, మెన్ యూనిఫామ్ టర్న్ ఔట్, కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తనిఖీ చేశారు. పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, మరియు చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారెక్స్, స్టేషన్ రికార్డుల మెయింటేనెన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న/ కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలతో, యువతతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. స్టేషన్ పరిధిలో గల రౌడీ, సస్పెక్ట్, హిస్టరీ షీటర్లను చెక్ చేస్తూ ఆన్లైన్ రికార్డులో నమోదు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారి షీట్స్ ను సంబంధిత ప్రాంతాలలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ లకు పంపాలని తెలిపారు. అలాగే పాపిలోన్ డివైస్ ను వినియోగించి అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను చెక్ చేస్తూ.. పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపు, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ.. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన ఎస్.సి.ఎచ్. పార్ట్ 1 -- 5, జనరల్ డైరీ, ఎఫ్.ఐ.ఆర్. ఇండెక్స్, ఆల్ఫాబీటికల్ ఇండెక్స్, డ్యూటీ రోస్టర్, విస్టింగ్ నోట్ బుక్స్, రౌడీ, సస్పెక్ట్ షీట్స్, గన్ లైసెన్స్ రిజిస్టర్, ఎల్.ఎల్.ఐ., గవర్నమెంట్ ప్రాపర్టీ రిజిస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, మొదలగున్నవి చెక్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్సై కి సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు.బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డయల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయి. ఇట్టి అప్లికేషన్ల పై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. సిబ్బంది తో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..... పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, మరియు చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని తెలిపారు. పోలీసు సిబ్బంది ప్రతి చర్య ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా ఉండాలని, సేవాభావం మరియు నిజాయితీతో విధులు నిర్వర్తించడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని సూచించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించి నప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకు రావచ్చు అన్నారు. ఓకే చోట పని చేస్తున్నప్పుడు ఫ్రెండ్స్ లాగా కలిసి మెలసి ఉండాలని, పాజిటివ్ ఆలోచనలతో పని చేయాలని అన్నారు. ప్రజలు పోలీస్ యూనిఫామ్ కు ఎంతో గౌరవం ఇస్తారో అంతే గౌరవం తో బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. విధులను, పర్సనల్ లైఫ్ ను బాలన్స్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. పోలీస్ స్టేషన్, రికార్డుల మెయింటెనెన్స్, సిబ్బంది పనితీరు పై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ , డిఎస్పీ మొక్కలు నాటారు





# హైదర్ గూడ చౌరస్తాలో రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలి



హైదర్ గూడ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్



రోడ్డు ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

**బుద్వేల్, జూలై 21 (ప్రభాత ఉదయం)**

హైదర్ గూడ చౌరస్తా లో రోడ్లపైన దుకాణాలు పెడుతున్న వారి కారణంగా ప్రతి రోజు ట్రాఫిక్ జామ్ అవుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇదే విషయమై అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. 143 పిల్లర్ నుంచి హైదర్ గూడ బస్తీలోకి వెళ్లే మార్గంలో, బస్తీ చౌరస్తాలో దుకాణాలు ఉన్న ప్రాంతంలో వాటి ముందు కూరగాయలు, పండ్లు, పూల దుకాణదారులు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని దుకాణాలను నిర్వహిస్తున్నారన్నారు. వాటి దగ్గర కొనుగోలు కోసం వచ్చిన ప్రజలు వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తు ఒడటంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో స్కూల్ పిల్లలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండుగల సమయంలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉ ంటుందన్నారు. ఫుట్పాత్ స్థలాలను ఆక్రమించి తోపుడు బండ్లపై దుకాణాలు పెట్టుకోవడంతో లక్షలు రూపాయలు అడ్వాన్స్ గా చెల్లించి దుకాణాలు నడుపుతున్న వారికి కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని దుకాణదారులు అంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుక్కొవాలని కోరుతున్నారు.



ప్రకాష్ గౌడ్ ను కలిసి సన్మానించిన పడమటి శ్రీధర్ రెడ్డి

# ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలసి ఆశీర్వాదాలు తీసుకున్న పడమటి శ్రీధర్ రెడ్డి

**బుద్వేల్, జూలై 21 (ప్రభాత ఉదయం):**

రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు శివరాంపల్లి కి చెందిన పడమటి శ్రీధర్ రెడ్డి మం గళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ ను మైలార్దేవుపల్లి లోని ఆయన నివాసంలో కలసి సన్మానించారు. తనను రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని పడమటి శ్రీధర్ రెడ్డి కి సూచిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందజేయడంలో చురుకుగా వ్యవహరించాలన్నారు. డివిజన్ లో సర్ కార్యక్రమాన్ని విజయవంతం గా జరిపించాలన్నారు. కార్యక్రమంలో గుడి మల్కాపుర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, మాదూరి ప్రభాకర్ రెడ్డి, పిట్టల లక్ష్మణ్ ముదిరాజ్, చెరుకుపల్లి రణధీర్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, బద్దం శ్రీధర్ రెడ్డి, మామిడి సంజీవ రెడ్డి, రాము, పోరెడ్డి ధర్మారెడ్డి, పెండ్యాల సాయిమల్లిక్, రగడంపల్లి శ్రావణ్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ సిఏ లీగ్ లో మైలార్ దేవ్‌పల్లి కుర్రాడి ప్రతిభ..

## ఆరు వికెట్లతో మ్యాచ్ ను తిప్పేసిన చరణ్ తేజ్ యాదవ్

**రాజేంద్రనగర్,జూలై 21(ప్రభాత ఉదయం)**



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిడివిజన్ టూ డేస్ లీగ్ అండర్-19 ఛాంపియన్షిప్,లో రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లికి చెందిన యువకుడు బల్ల చరణ్ తేజ్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. 17ఏళ్ల వయసులోనే అండర్-19జట్టులో చోటు దక్కించుకున్న చరణ్ తేజ్ యాదవ్ ప్రస్తుతం లెగ్ స్పిన్ బౌలర్‌గా అద్భుత ప్రతిభ కనబరు-స్తున్నాడు. బిడివిజన్ టు డేస్ లీగ్ ఛాంపియన్షిప్,లో హైదరాబాద్ బ్లూస్ జట్టుపై ఆరు వికెట్లు తీసుకొని కాంటినెంటల్ జట్టును ఒంటి చేత్తో గెలిపించాడు.పదేళ్ల వయస్సు నుంచి క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన చరణ్ తేజ్ అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ కనబరుస్తూ హెచ్సీఏ అండర్-16,అండర్-17లకు ప్రాతినిత్యం వహించాడు.మైలార్ దేవ్ పల్లికి చెందిన ఈ యువ క్రికెటర్ శివరాంపల్లిలోని సెంటర్ ఫర్ క్రికెట్ ఎక్సలెన్స్(సీహెచ్ సీ)కోచింగ్ సెంటర్ లో తర్ఫీదు పొందుతున్నాడు.గతంలో జరిగిన హెచ్సీఏ లీగ్లలో సైతం తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నాడు. మంగళవారం జరిగిన మ్యాచ్ లో చరణ్ తేజ్ యాదవ్ 10ఓవర్లు బౌలింగ్ చేసి ఆరు వికెట్లు తీసుకొని కాంటినెంటల్ జట్టును గెలిపించాడు. మ్యాచ్ లో అత్యధిక వికెట్లు తీసి మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు.ఈ ప్రతిభతో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అందరూ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



# కూలడానికి సిద్ధంగా ఉన్న పాడుబడిన ఇంటి గోడ..

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 21(ప్రభాత ఉదయం)**

ఏదైనా పెను ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు పోయాకే అధికారులు స్పందిస్తారా? అని గద్వాల పట్టణంలోని శెరెల్లి వీధి (37వ వార్డు) కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శెరెల్లివీధిలోని రాఘవేంద్రస్వామి దేవాలయం పక్కనే ఉన్న ఒక పాడుబడిన ఇల్లు సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి సగం కూలిపోవడంతో మున్సిపల్ సిబ్బంది వచ్చి కూలిన మట్టి, రాళ్లను పక్కకు జరిపి అదే గోడ ముందు పెట్టి తమ పని అయిపోయిందన్నట్లు చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ ఇంటికి సంబంధించి మిగిలిన గోడ కూడా అత్యంత ప్రమాదకర రీతిలో, ఏ క్షణంలోనైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. సోమవారం గోడ కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అయితే, ఈ మార్గం నిత్యం ప్రజలు, పాఠశాల విద్యార్థులు సంచరించే రద్దీ ప్రాంతం. ఇప్పుడు గనుక ఆ మిగతా గోడ కూడా కూలిపోతే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

# మూసాపేట్ శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయంలో బోనాల సందడి

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్**

**కూకట్ పల్లి, జూలై 21 (ప్రభాత ఉదయం)**



ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా మూసాపేట్‌లోని శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయం భక్తుల రద్దీతో కళకళలాడింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి బోనాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి గీతాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు, సమృద్ధి కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా, బండి రమేష్ అమ్మవారికి మొక్కులు చెల్లించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆత్మీయత, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే గొప్ప పండుగ బోనాలని అన్నారు. అమ్మవారిపై ప్రజలకు ఉన్న అపారమైన భక్తి, విశ్వాసానికి ఈ ఉత్సవాలు నిదర్శనమని పేర్కొన్నారు. బోనాల పండుగ సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని, ప్రజలందరూ పరస్పర సహకారంతో, ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని చెప్పారు. అమ్మవారి కటాక్షంతో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఇంటా శాంతి, శ్రేయ-స్సు, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఆలయ కమిటీ చైర్మన్ తూము శ్రీనివాసరావు, కర్క పెంటయ్య, గురజాల ఎల్లేష్, మల్లేష్ యాదవ్, కలికోట శంకర్, నయీమ్, వాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల వేడుకలతో మూసాపేట్ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో నిండిపోయి, అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. స్థానికులు, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య శ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగాయి.



## 'మై భారత్ -- నేషన్ ఫస్ట్ చాలెంజ్'లో సత్తా చాటిన డిగ్రీ కళాశాల విద్యార్థి రమేష్

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం.**

**యువత దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి: ఎమ్మెల్యే**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 21(ప్రభాత ఉదయం)**

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'మై భారత్' ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి "నేషన్ ఫస్ట్ చాలెంజ్" కార్యక్రమంలో గద్వాలలోని ఎంఎఎల్ డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి, ధరూర్ మండలానికి చెందిన రమేష్ విశేష ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గద్వాల బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి విద్యార్థి రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి 'మై భారత్' వంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని ప్రాంతానికి, కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థి రమేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు అవార్డు గ్రహీత రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ కలంధర్ పాష తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ కలంధర్ పాష, జిల్లా యూత్ ఆఫీసర్ కోట నాయక్, యూత్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు నాగరాజు, అనిల్, రాజేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాధనాన్ని దోచుకోవడమే తప్ప అభివృద్ధి శూన్యం

**బిజెపి యువమోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**

**కూకట్ పల్లి, జూలై 21 (ప్రభాత ఉదయం)**




శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ లో ప్రజా సమస్యలపై ఎల్లమ్మబండ హనుమాన్ టెంపుల్ నుండి ఎన్టీఆర్ నగర్ కాలనీ మీదుగా జయశంకర్ కాలనీ వరకు ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు చిన్నగాలొల్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర లో బిజెపి యువమోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, కేశవరావు, రామరాజు, స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ లో అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డ్రైనేజ్, మంచినీటి, శానిటేషన్ సమస్యలు నిత్యం ఏర్పడుతున్న సంబంధిత అధికారులు సిబ్బంది పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఇట్టి సమస్యలతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురివుతున్న మాజీ కార్పొరేటర్ పట్టించుకోకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప అభివృద్ధి శూన్యం అని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడంలో ఉన్న ఆలోచన ప్రజల మీద ప్రజా సమస్యల మీద ఏ ఒక్కరోజు చూపియ్యలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే జిహెచ్ఎంసి, ఆరోగ్య సిబ్బంది స్పందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు, ఈ కార్యక్రమంలో నాయకులు మని భూషణ్, వెంకట స్వామి రెడ్డి, రఘు అనిత, నరసింహచారి, జ్యోతి, సురేష్, శ్రీనివాస్, భరత్, శ్రీను, ప్రకాష్, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, అంజి, విష్ణు, రమేష్, నరసింహ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన అభ్యర్థులు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

**మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 21(ప్రభాత ఉదయం)**



ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి మాట్లాడుతూ...కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యాలయం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల వివరాలు:

- కామర్స్ -- 2 పోస్టులు
- కంప్యూటర్ సైన్స్ ఉ అప్లికేషన్స్ -- 1 పోస్ట్
- హిస్టరీ -- 1 పోస్ట్
- పొలిటికల్ సైన్స్ -- 1 పోస్ట్
- తెలుగు -- 1 పోస్ట్
- జువాలజీ -- 1 పోస్ట్

సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణతతో సాధారణ అభ్యర్థులు కనీసం 55% మార్కులు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 50% మార్కులు సాధించి ఉండాలి. నెట్, స్లేట్, సెట్, పీహెచ్డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, అనుభవ ధ్రువపత్రాలు (ఉన్నట్లయితే) ఇతర అవసరమైన పత్రాలతో కలిసి ఈనెల 24 తేదీ సాయంత్రం 4.00 గంటలలోపు ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గద్వాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి తెలిపారు.



## ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

**చెరువుల సుందరీకరణ కు కృషి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, జూలై 21 (ప్రభాత ఉదయం)**

అమీన్పూర్, పటాన్ చెరు సర్కిళ్ల పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్టిఎల్ పరిధిలోని స్థలాల ఆక్రమణకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో గల పోచమ్మ కుంట, అమీన్పూర్ డివిజన్ పరిధిలోని దయారా పరిధిలోని జంగంకుంటల పరిధిలో చెరువు సరిహద్దులను నిర్ణయించి.. సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వడక్పల్లి గ్రామ చెరువు బఫర్ జోన్ పరిధిలో ప్రముఖ నిర్మాణ సంస్థ బఫర్ జోన్ ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిందని స్థానికులు ఫిర్యాదు చేయడం జరిగిందని.. వెంటనే దానిని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందిస్తూ ప్రకృతి సమతుల్యతకు కీలకమైన చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని.. ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డిఈ బాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## అమీన్ పూర్ పోలీస్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు

**పటాన్ చెరు, జూలై 21 (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అమీన్ పూర్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ రెడ్డిని అమీన్ పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, దండు రమేష్ యాదవ్, మనే రవీందర్, మున్న, మహేష్, మహేష్ గౌడ్, ఈశ్వర్ రెడ్డి, మెగావత్ సురేష్ నాయక్, సత్తన్న ముదిరాజ్,కురుమ నరేష్ యాదవ్, దేవదానం, కొడకంచి రాజు ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్,మస్తాన్ నాయుడు, కృష్ణ, సురేష్, షేక్ ఉమేర్, షేక్ జాబేర్ కూడా సీఐ ప్రవీణ్ రెడ్డిని కలిసి అభినందించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



## మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి


**కేటిదొడ్డి మండలంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విస్తృత పర్యటన**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ముషాయిదా బేగం మంగళవారం కేటిదొడ్డి మండలంలో విస్తృతంగా పర్యటించి, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా కుచినెర్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న విలేజ్ ఆర్గనైజేషన్ భవనాన్ని అధికారి పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు మరియు భూగర్భ జల మట్టం పెరగడానికి ఇంకుడు గుంతలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ విషయంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి, రైతులను ప్రోత్సహించి గ్రామంలో కనీసం 5 ఫామ్ పౌండ్స్ (పంట కుంటలు) నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ సులభ్ కాంప్లెక్స్‌ను ఆమె తనిఖీ చేసి, వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అలాగే కొండాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు , అధికారులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను అధికారులు, గ్రామస్తులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామన్ గౌడ్, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ టి ఏ, ఏపీవో, ఏయి పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎల్ నీ నో నేపథ్యంలో కూరగాయలు ముద్దు.. వరి వద్దు:






**ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి**

**హైదరాబాద్, జూలై 21(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే మొదలైన ఎల్ నీ నో ప్రభావం నేపథ్యంలో కూరగాయలే ముద్దని, బోరుబావుల కింద ఎట్టి పరిస్థితిలోనూ వరి సాగుకు రైతులు మొగ్గు చూపొద్దని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజి రెడ్డి కోరారు. హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన ఎల్ నీ నో నేపథ్యంలో పసిఫిక్ సముద్రం వేడెక్కడం నుండి తెలంగాణ సంసిద్ధత అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్లో ఆయన మాట్లాడారు. బోరుబావుల కింద ప్రస్తుతం ఆముదం, కందులు సాగు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ ఇతర రాష్ట్రాల నుంచి 4 వేల కోట్ల రూపాయలు విలువైన కూరగాయల దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో రైతులకు ఇన్సెంటివ్స్ ఇచ్చి, కూరగాయల సాగును ప్రోత్సహించాలని కోరారు. ఎల్ నీ నో నేపథ్యంలో ఇప్పటికే ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక విడుదల చేసిందని, అన్ని ఉద్యాన పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా వివరించడం జరిగిందని అన్నారు. ఉద్యాన శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామసభల్లో పాల్గొంటూ, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంటల ప్రణాళిక సంబంధించి రైతులకు వివరిస్తున్నారని తెలిపారు. స్వల్ప కాలిక కూరగాయ పంటలు అయితే ఇంకా మేలని ఈ సందర్భంగా సూచించారు. గత పది సంవత్సరాలుగా అవసరానికి మించి ఎరువులు వాడుతున్న నేపథ్యంలో, కనీసం ఎల్నీనో కాలంలోనైనా ఈ రసాయన ఎరువులు తగ్గించాలని కోరారు. ప్రభుత్వంతో కలిసి ఎన్ నీ నో ప్రభావం తీవ్రత సాగు రైతులపై ఉండకుండా శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం పనిచేస్తుందని డాక్టర్ రాజి రెడ్డి తెలిపారు.